# పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# పేదల కోసమే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం..!

## విజయవంతంగా 65వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా వైద్య శిబిరం.















**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22:**

పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల కోసమే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 65వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తన తల్లిదండ్రుల నుండి తనకు వచ్చిన 10 ఎకరాల పొలాన్ని పేదల కోసమే కేటాయించినట్లు చెప్పారు. తన పదకరాల పొలంలో పెద్దిరెడ్డి ట్రస్ట్ తరఫున ప్రజా వైద్యశాలను నిర్మించి అక్కడ పేదలకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. జన్మనిచ్చిన ఊరికి సేవ చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. పేద ప్రజలకు డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డినీ సేవలు అభినందనీయమనీ అన్నారు. ఇందులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్మించి మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తూ తనకు జన్మ ఇచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడమేనని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఆయన చేస్తున్న సేవలే మాకు శ్రీరామరక్ష అన్నారు. 65వ మెగా వైద్య శిబిరంలో 1200 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్, షేక్షావలి రెడ్డి వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు , మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబంధించిన వ్యాదులు, చెవి, ముక్కు, గొంతుకు సంబందించిన జబ్బులకు, దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామని తెలియజేశారు. కోవెలకుంట్ల సంజామల మండలం పరిసర ప్రాంతం ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు.















# వైసీపీ పార్టీ తమ ఉనికిని చాటుకునేందుకు..

# రాజకీయాలకు దేవుడుని వాడుకోవడం దురదృష్టకరం..!

## రాష్ట్రంలో దేశంలో కాంగ్రెస్ మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధికి క్యాన్సర్ వంటివి.

## ..నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 22:**

నంద్యాల జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసిపి, కాంగ్రెస్ పార్టీలు క్యాన్సర్ లాంటి పార్టీలని, ప్రజల విశ్వాసాలతో రాజకీయాలు చేస్తున్నాయన్నారు.

కలియుగదైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని అభిరుచి మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏడుకొండలు కాదు మూడుకొండలు అన్న వ్యాఖ్యల



కారణంగా స్వామి ఆగ్రహానికి గురైన విషయాన్ని ప్రజలు మరువలేదని గుర్తుచేశారు.దేవుడి ఫోటోలు చేతిలో పట్టుకుని చెప్పులు వేసుకుని రాజకీయ ప్రదర్శనలు చేయడం హిందూ సంస్కృతికి అవమానమని ఆయన స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసాలను కించపరచే విధంగా ప్రవర్తించడం సరికాదని హెచ్చరించారు.

వచ్చే ఎన్నికల్లో ఏమి జరిగినా వైసిపి పార్టీని ప్రజలు ఆదరించరని, హిందూ సమాజాన్ని అవమానించే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు అన్నారు. ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల గౌరవ రక్షణలో బీజేపీ ఎప్పటికీ ముందుంటుందని అభిరుచి మధు స్పష్టం చేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి కొనసాగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.